" నా మంత్రాలు డబ్బుకు పనిచేసేవి కావు మనిషికి మనిషి సహాయమనేదే నా తాత తండ్రులు నేర్పింది. రాత్రికి వస్తానులెండి "

★ ★ ★

" మాస్టారూ, పన్నెండయింది" "ఇదిగో లైటార్పేశాను ఇక్కడే నా విభూతి బుర్రతో కూర్చున్నాను. మీరంతా బయటుండండి పనవ్వగానే తలుపు తీసి పిలుస్తాను "

★ ★ ★

" మాస్టారూ, నిద్ర పోతున్నారా? లేవండి నా మీద రక్తం పడింది."..." చీకట్లో నిచ్చెనెక్కి కాగితాన్ని మిరాయి పొట్లాం చేసి దాంతో నా విభూతిని అక్కడ పైకప్పులో వూదాను దయ్యం టక్కున కింద పడింది. చూస్తారా? ఇదుగో ఇటు.. ఇటు . ఈ మూల..."

" ఆఁ గబ్బిలమా! మరి రక్తమో?"

" ఎలికదో పిచ్చుకదో అయ్యుంటుంది. పైకప్పెక్కి పెంకుల్లో వెతకండి. మరి నా విభూతి, అదే గమాక్సిన్ ఖర్చు పావలా రేప్పొద్దున సాంబయ్య కొట్లో అప్పు తీర్చెయ్యటం మరిచిపోకండి వస్తాను."

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 28-12-83)

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

# కథ చెప్పు పిల్లాడా...

"మాంచి కథేదయినా చెప్పరూ... పత్రిక్కి రాయాలి" - భర్త యోగారావుకు వక్కపొడి అందిస్తూ అంది సుందరి.

మంచం మీద పడుకొని వీక్లీ చదువుకుంటున్న యోగారావు, పుస్తకంలోంచి చూసి, " కతా!... నేనేం చెప్పగల్ను !.. యు.డి.సి.లు కథలు రాయరు ఆఫీసు నోటులు రాస్తారు. "

సుందరి, పెద్దలైటు ఆర్పేసి, ఆకుపచ్చలైటు వేసింది పిల్లలు మధ్యగదిలో పడుకొనున్నారు. కనక గది తలుపులు ఓరవాకిలిగా వేసి, తమలపాకుల చిలకల్తో వచ్చి భర్తపక్కన మంచమ్మీద కూర్చుంది. చిలకలందిస్తూ అంది " రాసేది నేను. మీరు చెప్పండి చాలు! "

" కథలూరావు, నాకు కాకరకాయలూ రావు. నిద్దరొస్తోంది పడుకోనీ!" పుస్తకమూసేస్తూ అన్నాడు యోగారావు. . సుందరి, తనుకూడా రెండు చిలకలు నోట్లో పెట్టుకుంటూ భర్త పక్కన పడుకొంది. "భర్తని ఏదో ఒకటి చెప్పండి ప్లీజ్!"

" నన్నొదిలెయ్ అమ్మతల్లీ!". " వొదల్ను!. అరిగిపోతారేంటి పెద్ద! " అంటూ మూతిని మూడువంకర్లు తిప్పి గునుస్తూ అంది సుందరి. " ఏదో ఒక కథ చెప్పు పిల్లాడా మంచి తాయిలం పెడతాగా!"

యోగారావు చిరాగ్గా లేచి కూర్చున్నాడు అన్నాడు "సరే , విను! అనగనగా ఓ ఎర్ర పిల్లుంది

ఆ ఎర్ర పిల్ల చదువుకున్నది తెలివైంది రచయిత్రి కూడాను అయితేనేం, అందరికీ వేపకాయంతుంటే ఈ గుంటకి గుమ్మడికాయంతుంది - వెర్రి. ఏం ఆ ఎర్రపిల్ల ఒకరోజున..''

సుందరి చటుక్కున అతని నోరు మూసింది " ఎర్రపిల్లంటే?'' ... " ఎర్రగా ఉండేపిల్ల.'' ... ''ఎక్కడ ఎరుపు మొహమా, చేతులా, కాళ్ళా? గులాబీ ఎరుపా, సూర్యోదయం ఎరుపా, గోరింటాకు ఎరుపా?''

" అబ్బబ్బ ఏదో ఎరుపు!... పోనీ, నీలాగ ఉంటుందనుకో !'' ... " నాలాగ అంటే?''... " నీ ఒళ్ళు లాంటి ఒళ్ళూ, చదువుకున్న అమోఘమైన తెలివి...''

" ఆగాగు నాయుడూ !.. తెలివెక్కడున్నా చదువుకుంటుందా? పోనీ ..అమోఘమైన అంటే?''

" ఎన్నో ఏళ్ళు సంసారం చేసిన అనుభవంతో జాణతనంగా మాటల్తో చావగొట్టి పక్కవాళ్ళని నిద్ర పోనివ్వకండా చేసే తెలివి.''

" సంసారం చెయ్యడమంటే?''.. " అది చేప్పేది కాదు ఎంకీ !''... " అది చేప్పేదికాదూ!... చెప్పటం చేతకాని వాడివి ఎర్రపిల్లగురించీ , సంసారం గురించీ ఎందుకెత్తుకున్నావ్? ఇంకే కథా, కనీసం దయ్యం కథయినా దొరకలేదా? ఆఁయ్, అమ్మా!''- సుందరి సున్నితంగా యోగారావు చెంపమీద కొట్టింది.

యోగారావు అభిమానం దెబ్బతింది. అతను చటుక్కున మంచం దిగాడు. చురుగ్గా సుందరి వంక చూసాడు. చూసి చూసి దిండొకటి తీసి గచ్చు మీద పడేసి ఆ పళానే నేల మీద పడుకున్నాడు.

సుందరి బిక్కమొహం పెట్టేసింది. " పొరపాటు. ఇంకెప్పుడూ అనన్లెండి! మంచమ్మీదికి రండి... ఇదిగో మిమ్మల్నే ! జ.. రారా? . ఇంకెప్పుడూ నా పక్కన పడుకోరా?... '' సుందరి స్వరం గద్గదికమయింది. '' అసలు నేనెంత ఆవేదన పడుతున్నానో ఎప్పుడైనా గమనించారా? ఇన్నాళ్ళూ పద్యాలు రాసాను. ఇప్పుడు కథలు రాయాలనిపిస్తోంది. లోపల్నుంచి విపరీతమైన ఊపొచ్చేస్తోంది. అసలీ ఊపు నాకు చిన్నప్పట్నుంచీ ఉంది. మీరు సరసులనీ, రసికులనీ, నా రచనా కార్యక్రమానికి సహకరిస్తారనీ ఎన్నెన్నో ఊహించుకుని మీతో పెళ్ళికి ఇష్టపడ్డాను. మన పెళ్ళయి ఇన్నాళ్ళయింది. ఒక్క ప్లాటంటే ఒక్క ప్లాటు - ఏనాడైనా నాకు చెప్పారా? .. ఇదిగో మిమ్మల్నే ! ప్లాటూ పిండాకూడూ ఏమీ లేకపోతే ఏం చేసుకోనమ్మా ఈ మొగుణ్ణి నేనూ! నలభయ్యో పడిలో పడ్డవాడికి కథలే రావా? .. ఇదిగో, నిజంగా రాకనేరావంటూన్నారా, నాతో సహకరించటం ఇష్టంలేక రావంటున్నారా! .. ఏదోనేను గాబట్టి ఇట్లా గుట్టుగా, మీరెన్ని వైరాగ్యప్పోకడలు పోయినా, సంసారం ఈడ్చుకొస్తున్నాను. అదే యింకోత్తె అయితేనా...''

యోగారావు మళ్ళీ ఓ సారి చురుక్కున సుందరి వైపు చూసి దుప్పటి ముసుగు పెట్టేసాడు.

కోపమూ, రోషమూ మిళితమైన స్వరంతో సుందరి అంది. " సరే చెప్తున్నా నబ్బాయ్!... వారం రోజులు టైమిస్తున్నాను. నాకేమయినా ప్లాటు చెప్తావా సరే ! లేకపోతే ఇదుగో, నా ఆయుధం నాకుంది!''

సుందరి దిండూ దుప్పటీ తీసుకుని వాకిట్లోకి నడిచింది. మడత మంచం వాల్చుకుని పడుకుంది. తెల్లార్లూ ఆ తలుపులు అట్లా తీసే ఉన్నాయి.

ఆ మర్నాటి నుంచీ భార్యాభర్తలిద్దరూ మాట్లాడుకోటం మానేశారు. ఎడమొహం పెడమొహం అయ్యారు. ఎప్పుడన్నా యోగారావు మాట కలపటానికి ప్రయత్నించినప్పటికీ, " ప్లాటు చెప్పని మొగుడూ ఒక మొగుడేనా? ఛీ!'' అనే డైలాగుతో సంభాషణ తుంచేస్తోంది సుందరి. యోగారావు విరక్తిగా తయారయ్యాడు.

ఓ ఆదివారంనాడు ఇద్దరికీ మాటామాటా వచ్చింది. " మీరు ప్లాటు చెప్పందే ఈ రాత్రికి వంటచెయ్యను!" అని భీష్మించింది సుందరి

" నీకీమధ్య అతి తెలివి ఎక్కువైంది. ఏ పాచికట్టె అయినా నీలాగా మాట్లాడుతుందా సొంత మొగుడితో! సరే. నువ్వు వండిపెడతానన్నప్పుడే నేను కొంపలో తింటా. అంతవరకూ హోటల్ నాకు అన్నదాత!" అంటూ యోగారావు విసురుగా బయటకొచ్చాడు. సైకిలెక్కాడు.

యోగారావుకాలొచన్లొస్తున్నాయి. "ఇంత చిన్నవిషయం మీద సుందరికీ పట్టేమిటి! ఆమె రచయిత్రి అయితే ఇంట్లో అందరూ కూడా రచయితలూ, కథకులూ అయి తీరాలా? బుర్రలో ఆలోచన్లొస్తున్నప్పటికీ తనెన్నడూ కథగాదు సరిగదా కలలుకూడా బయటికి చెప్పలేడు గదా! అయితే మరి ఇంటి ఆడదాన్తో పేచీ పడ్డ ఏ మగాడూ ఏ కాలంలోనూ సుఖంగా శ్వాస పీల్చి చావలేదే! కాంతామణితో కలతలొస్తే, కొంపలో సాగేది సంసారంకాదు, కన్నీళ్ళ కాసారమెగదా? . ఏదో విధంగా రాజీకొచ్చినవాడే గొప్ప సంసారి... అయితే, తనిప్పుడు ఎట్లా రాజీ పడాలి? చచ్చుదో పుచ్చుదో ఏదో కథచెప్పి! అంతేగదా!... ఏం కథ చెప్పగల్ను చెప్మా!" ఇట్లా ఆలోచించుకుంటూ వెడుతూండగా రాత్రి ఎనిమిదయింది.

ఒక సందులో చిన్న మలుపు దగ్గరున్న ఇంట్లోంచి ఇంచుమించు ఏడుపుస్వరంతో స్త్రీ మాటలు వినపించాయి. యోగారావు చటుక్కున సైకిలు దిగి చక్రానికేదో రిపేరు చేసుకుంటున్నట్టు నటిస్తూ ఆ మాటలు విన్నాడు.

స్త్రీ కంఠం " ...నా కర్మకాలింది. నా ఆశలు మంట కలిసాయి. ఇంతమోసం నా మెడకొచ్చి చుట్టుకుంటుందని నేనెన్నడూ కల కూడా కనిచావలేదు... మీరు బి.యే. పాసయ్యారని చెబితే మీ మాటల్ని నమ్మి, ఇంటర్ పాసయిన నాకు మిమ్మల్ని కొనిపెట్టారు మా వాళ్ళు. మీరు టెన్త్ కూడా పాసవ్వలేదా?... ఎనిమిది ఫెయిల్డా! ప్యూనుద్యోగం కూడా రాదా!. నాగతేం కాను!. ఓరి దేవుడో ,ఏ జన్మలో ఏ పాపం చేసాన్రో దేవుడో! నాకీ శనిప్పుడిట్లా తగిలింది దేవుడా! . . ఓరి దేవుడో, నా దేవుడా! .."

-పురుషకంఠం " ఏయ్ జాగర్తగా మాట్లాడు! .. బి యే పాసయ్యానని నేనొచ్చి చెప్పానా నీకు?... మీ వాళ్ళకెవళ్లు చెప్పారో నాకు తెలీదు. బజారుదాన్లాగా ఊరికే నోరు పారేసుకోమాక !"

స్త్రీ కంఠం " ఇప్పుడు నా బతుకు బజారులోనే పడబోతోందిగాదా! . . నేనెట్లా బతికేది దేవుడా !" పురుషకంఠం"ఊరికే గొంతే చించుకోమాకే మారెమ్మా.. చూస్తూండు నేనిట్టే పాసయిపోతాను బి.ఎ! నువ్వు నోరు తెరిచే రోజు తొందర్లోనే వస్తుంది".. స్త్రీ కంఠం " షష్ఠి పూర్తిలో అక్షరాభ్యాసంట! ( ఆవేశంగా) ఇదుగో చెప్తున్నా! ఏదో ఉద్యోగం చేసి మీరు నన్ను పోషించాల్సిదే! నేను గడప దాటెళ్ళి ఉద్యోగం చెయ్యటం మాట ఒట్టిది."

పురుషకంఠం " అట్లాగేలే అరవకు" ఆపైన మాటలు వినిపించలేదు.

యోగారావు మొహం వికసించింది. టక్కున సైకిలెక్కాడు. రయ్యిన ఇంటికొచ్చేసాడు. సుందరితో, " దొరికిందోయ్, ఫస్ట్క్లాసయిన ప్లాటు దొరికింది." అన్నాడు.

సుందరి మొహం విప్పారింది. పిల్లలు అప్పటికే అన్నాలు తిని పడుకున్నారు. ఇద్దరూ భోజనాలు చేసారు. ఏకశయ్యాగతులయ్యారు

సుందరి, " ఇహ చెప్పండి, మీ ప్లాటు " అంది. యోగారావు, తను విన్న సంభాషణనంతటిని చెప్పి, " ఇదీకథ" అన్నాడు

"మరి ముగింపో?" అంది సుందరి. " ముగింపులూ, మొదళ్లూ కూడా ఏడుస్తాయా కథలకి?...

అయితే. ఆఁ ఏముంది ఆ అక్కుపక్షి బి యే ఎప్పటికీ పాసవ్వలేదు గనుక ఆ అమ్మాయి... చచ్చిపోదుగాని ... లేచ్చక్కాపోతుంది, ఇంకోడితోనో, ఒంటరిగానో'' ... వెటకారంగా అంది సుందరి, '' ఎంచక్కా తిరిగొస్తుందికథ!. ఇదిగో నాయుడూ, రేపు వంట సమయానికల్లా ముగింపు చెప్పావా సరే, లేకపోతే నువ్వసలు మగాడివేకాదు హుఁ!'' ... యోగారావు పక్కమీద లేచికూర్చున్నాడు. కోపంగా అన్నాడు, '' మగ ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నావ్ పిల్లా, జాగర్త !''

యోగారావు చటుక్కున దిండు నేలమీదికి విసిరేసి వచ్చి దానిమీద పడుకున్నాడు. అంత కన్నా విసురుగా సుందరి, ఇంకో దిండు నేల కేసికొట్టి అతని తలవైపు తలపెట్టి ఎదురుదిక్కులోకి తిరిగిపడుకుంది.

ఆ ఇద్దర్నీ చూసి మల్లెపువ్వులాంటి దుప్పటి పక్కుమని నవ్వింది!

★ ★ ★

తెల్లారింది.... యోగారావు లేచి స్నానము, ప్రార్థనా కానిచ్చుకున్నడు. సుందరి కాఫీ కప్పు తెచ్చి పక్కన పెడుతూ, ''రాత్రిమాట జ్ఞాపకముందా?'' అంది.

యోగారావు బేలగా చూసాడు. క్షణంలో మొహంలోకి పౌరుషం పొంగుకొచ్చింది. కళ్ళు ఎర్రబడ్డాయి '' అంతేనా?'' అన్నాడు. .... '' అంతే!'' అంది సుందరి. విసురుగా వంటింట్లోకెళ్ళిపోయింది.

ఉసూరుమంటూ సైకిలెక్కాడు యోగారావు. ఇద్దరు ముగ్గురు స్నేహితులిళ్ళకెళ్లాడు. వాళ్లతో కూర్చుని నాలుగు కాకమ్మ పిచికమ్మ కబుర్లు చెప్పి మధ్యలో యధాలాపంగా తన ప్లాటు చెప్పాడు. '' ముగింపు ఎట్లా ఉంటే బాగుంటుంది.?'' అన్నాడు. వాళ్ళల్లో ఒకడు '' నువ్వు చెప్పిందే కరెక్టయ్యా యోగం!... లేచిపోతుంది. వీలైతే మొగుణ్ణి నాలుగు తన్ని !... ఈ రోజుల్లో అది ఫాషన్ గదా!'' అన్నాడు ఇంకోడు, '' నువ్వుండలూ, చుప్పాలూ అప్పడాలూ చేసి మొగుడికిచ్చి అమ్ముకురమ్మంటుంది. బతకాలి గదామరి !'' అన్నాడు.

యోగారావుకు భయం వేసింది ఈ ముగింపులు చెప్తే సుందరి మీద పడికరుస్తుందేమోనని! అప్పటికి టైము పదయింది. టక్కున అతని కాలోచనొచ్చింది. సర్రన తిన్నగా రాత్రెళ్ళిన ఇంటిదగ్గరకెళ్లాడు. ఇల్లు తాళం వేసుంది.

పక్కింటి ఇల్లాల్ని అడిగాడు. '' ఈ ఇంటి వాళ్ళు కులాసాగా వున్నారాండి? ఎక్కడికెళ్లారు?'' ... '' అళ్ళకేమంది సక్కగా సిలకా గోరింకల్లాగా ఉన్నారు. సెలవలుగదండీ ఇప్పుడే రైలు కెళ్ళారు'' అంది ఆమె.... ఆమె కూతురు- పన్నెండేళ్లది- ఎవరో పిలిచినట్టు ఇంట్లోంచి పరుగెత్తుకొచ్చింది. అంది '' అత్తయ్యగారేనా అమ్మా, అళ్లు పొద్దుటేలే బువ్వొండుకుని తినీసారే. నన్ను తమలపాకులిమ్మంటే తీసికెళ్లిచ్చాను. అయ్యోనుగుని తలుపు లేసేసుకున్నారు. కూస్సేపటికి మామియ్యగారి మాట్లుకోపంగా, సినిమా రౌడీ లాగా యినిపించినయ్యి. ఇంకూసేపుటికి ఎయ్యోయ్యో బాదలు ఆతర్వాత సినిమా హీరో హీరోయిన్లాగా నవ్వులు యినిపించినయ్యే!...''

ఆమె, తన కూతురువైపు కళ్ళురిమి చూసింది '' సదూకోయే సన్నాసీ అంటే, అళ్లేంజేసు కుంటున్నారో, యాళ్లేంజేసుకుంటున్నారో అరా తీత్తన్నావన్నమాట! పనీపాటా లేదంటే పిడక మొహమా! ఎళ్లెల్లు సదూకో పో!'' అంటూ యోగారావు వైపు తిరిగి'' ఆరు బాగానే ఉన్నారండీ బాబూ. మళ్ళీ నాలుగురోజుల్లో ఒచ్చారంటండి.'' అంటూ లోపలికెళ్లిపోయింది.

ఈ సన్నివేశంలోంచి యోగారావుకు మెరుపు లాంటి ముగింపు తొంగి చూసింది. అతని కథకి రఁయ్‌న ఇంటికొచ్చేసాడు. సుందరి వంట చేస్తోంది. వంటింట్లోకొచ్చి కూర్చుని అతనన్నాడు....'' సుందూ, చిన్నసందేహం- ఏమనుకోకు. ఆడవాళ్ళకి సంసారం కుతి ఏఏ సమయాల్లో ఎక్కువగా కలుగుతూంటుంది!''

సుందరి తికమకగా చూసింది నవ్వింది "ఏమో అందరి విషయమూ నాకేం తెలుసూ!.. నాకు మాత్రం . అప్పుడప్పుడూ మనం పొద్దున భోజనాలు చేసి లేచింతర్వాత మీరు ఆ పూటకి ఆఫీసుకెళ్ళకండా- ఇంట్లో ఉండిపోతే బాగుండుననిపిస్తుంది ఎక్కువగా రాత్రివేళల్లోనే అదుంటుందనుకోండి.." సిగ్గుపడింది సుందరి.

"రైట్!.. ఇంకోప్రశ్న.. ఇల్లాళ్ళు, సంసారంలో రేప్- అంటే, భర్తచేతనే బలత్కారం - అనేదాన్ని ఇష్టపడతారా, కోరతారా?" .. సుందరి ఆలోచించింది ఆమె మొహం ఇంకాస్త ఎరుపెక్కింది అంది, "ఆఁ హఠాత్తుగా మీరు నన్ను రేప్ చేస్తే బాగుండుననిపిస్తూంటుంది చాలా సమయాల్లో, ముఖ్యంగా ఇంటి పనిలో శ్రమపడి అలిసిపోయున్నప్పుడు కాని ప్చ్... మీరప్పుడు ఆఫీసులో ఉంటారుగా మరి!... చాలా మంది ఇతర ఆడాళ్ళగ్గూడా ఇట్లాగే అనిపిస్తూంటుందిట. మా పిన్ని కూతురు చెప్పింది"

"యురేకా!" - ఎగిరి గంతేసాడు యోగారావు. "పట్టేసాను చూస్కో! ముగింపురాస్కో! ... నీ కథలో హీరోయిన్ ముందర ఏడ్చి తిట్టి ఆ తర్వాత భర్తని క్షమించేస్తుంది. బి.యే.పాసవ్వకపోయినా ఫర్వాలేదులేవయ్యా మగడా! నాకో మగతోడుగా ఉండు చాలు' అంటుంది. హఠాత్తుగా వాణ్ణి కౌగలించేసుకుంటుంది. అంతే, ఇద్దరూ పార్వతీ పరమేశ్వరుల్లాగా హాయిగా జీవించేస్తారు. ఇప్పుడు జరిగిందదే! ఆ అమ్మాయిని భర్త సుఖంగా రేప్ చేసాడు. హాయిగా సుఖంగా భర్త వెనకాలే రైలెక్కింది ఆ అమ్మాయి. నేనెళ్ళి చూసొచ్చా."

సుందరి తికమక పడింది. ఒక్క నిమిషం ఆలోచించింది. విసుగ్గా అంది "ఆ అమ్మాయికి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా మళ్ళీ పాతమోసం విషయం ఎత్తి, భర్తని తిట్టొచ్చుగదా, దెప్పొచ్చుగదా! ఎక్కడో సకృత్తుగా ఒకచోట జరిగిందన్నమాత్రంచేత ఒక సంఘటనని జనరలైజ్ చేసి లోకం మీదికి వదిలెయ్యటం మంచి రచయిత లక్షణం కాదు. వార్తకీ, కలకీ మధ్యలో ఉండాలి. కథ అనేది. సమస్యలకి రచయిత చూపించే పరిష్కారం పదిమందికీ ఉపయోగించేదిగా ఉండాలి శాశ్వతమైంది అవ్వాలి. ఈ దృష్ట్యా మీరు చెప్పిన ముగింపు నిజంగా జరిగిందే అయినా నిజానికి అది ముచ్చటైన ముండమోపి ముగింపు... వెళ్ళండి. మీ ఫ్రెండ్సు నెవర్నయినా కనుక్కొని మంచి ముగింపు తీసుకురండి... వంట అయిపోవచ్చింది. మీరు రావటమే ఆలస్యం!వెళ్ళండి!"

హతాశుడయ్యాడు యోగారావు. విచారంగా మళ్లీ సైకిలెక్కాడు. ఇంకో నలుగురు స్నేహితులిళ్ళ కెళ్లాడు. లైబ్రరీ కెళ్ళాడు. అక్కడ కథలుచదవాలంటే బుద్ధి కుదరలేదు. కడుపులో ఆకలి దంచేస్తోంది. తప్పదని హోటల్లో భోంచేసాడు. ఇంకో స్నేహితుడింటికెల్లి కాస్సేపు నిద్రపోయాడు. నిలువెల్లా విషాదమైపోయి ఏం చెయ్యాలో తెలీక బస్సుస్టాండుకెళ్లాడు. అప్పటికి సాయంత్రం మూడయింది. అతని మిత్రుడొకడు అతన్ని కలిసాడు. అన్నాడు, "ఒయ్ యోగమా, నువ్విక్కడున్నావా! నీకోసం మీ ఆవిడ మా అందరిళ్లకీ వచ్చెళ్ళింది.ఈ పూట నీకు అన్న ప్రాశన కాలేదటగా వెళ్ళెళ్ళు!"

యోగారావు ఆశ్చర్యపడ్డాడు. సుందరికి మనసు ఎందుకు మారిందో అర్థం కాలేదతనికి

భర్తని గుమ్మంలోంచే చూసి ఎదురొచ్చింది సుందరి"పాపిష్టిదాన్ని! అనవసరంగా మిమ్మల్ని మాడ్చాను నేను మాడాను. ముందు స్నానం చెయ్యండి ఆ తర్వాత చెబుతాను అసలు విషయం."

యోగారావు భోజనం చెయ్యనట్టు నీరసం మొహం నటించాడు తమ కిద్దరికీ వడ్డించింది సుందరి అతను కతికాడు ఏదో తిన్నాననిపించాడు

గదిలోకొచ్చాక "ఏంటి, ముగింపు తట్టిందా?" అన్నాడు యోగారావు

వక్కపొడి అందిస్తూ సుందరి అంది "లేదండీ, ఇంకోటి జరిగింది ఇందాక చిన్నకునుకుపట్టింది

అందులో కలొచ్చింది. ఆ కల్లో మీరు కనిపించి నాతో ' నన్నింతగా ఆరడిపెడతావుటే రాక్షసీ! ... ఇదుగో నే పోతున్నా... మొదటగా కనిపించేది - అది నుయ్యిగాని గొయ్యిగాని। ఏదైతే అది - అదే ఇంక నా స్థావరం!' అన్నార్ట! దాంతో భయపడిపోయి నేను, ' ఏవండీ, ఆగరూ? ముష్టి ముగింపు ఇవ్వాళకాకపోతే రేపొస్తుంది. మనిద్దరం కలిసికట్టుగా కృషిచేసి ఆలోచిస్తే ఎప్పటికప్పటికి మనకి తట్టకపోదు. ఏదో పట్టుదల కొద్దీ మీరు మగవారేకారని బుద్ధితక్కువయి అన్నానే అనుకోండి ఆ మాత్రానికే నుయ్యీ గొయ్యీ అంటారా! ... వద్దండీ వెళ్ళొద్దు!' అని మీ కాళ్లు పట్టుకుని బతిమాలానట అప్పటికే నాకు గుండెదడ హెచ్చి మెలకువవచ్చేసింది. . నిజంగా మీరు నుయ్యో గొయ్యో చూసుకుంటారేమోనని- ఆహా। మీరలా చెయ్యరని తెలుసనుకోండి- అయినా ఎందుకైనా మంచిదని, అందరిళ్లకీ వెళ్ళివెతికొచ్చాను. మీరు మళ్ళీ కనిపించారంటే నాకెంత ఆనందంగా ఉందో! నిజంగా బతిమాల్తున్నాను నన్ను క్షమించరూ! వెధవ కథ! మీ కన్నా నాకు కథలెక్కువకాదు.''

'' నీకా కల రాకపోయుంటే నా గతింతేగా?''... ''ఛ.ఛ, ఏదో ఈ రోజుకు మాత్రం కొంచెం మిమ్మల్ని ఉడికిద్దామనుకున్నాను- ఏదో చిన్న షాక్ ట్రీట్‌మెంట్, అంతేగాని, నాలో అర్థభాగం మీరు. మీరు లేకుండా నేను బతగ్గలనా?'' సుందరి కంఠం గద్గదికమయింది.

యోగారావు ఆలోచిస్తూన్నాడు. ఉండుండి హఠాత్తుగా అన్నాడు '' ఆగాగు బుల్లామా! .. ఒచ్చేసింది, నీ కథకి మాంఛి ముగింపొచ్చేసింది. ... ఇప్పుడు నువ్వన్నావు చూడూ, ఆ మాటలే తీసుకో!...

హీరోయిన్ ఏంచేస్తుందంటే, భర్తతో ' సర్లెండి, జరగకూడని మోసమేదో జరగనే జరిగింది. .. నేను ఇంటర్ పాసయ్యాను కనక మీకు ట్యూషన్ చెప్పగల్ను. మనిద్దరం కల్సి కట్టుగా కృషిచేద్దాం. కష్టపడదాం. ఎప్పటికొప్పటికి మీరు ఇంటర్ పాసయితీర్తారు. ఆ పైన ఇద్దరం కల్సి బి.యే. కి కడదాం. అంతదాకా పిల్లలూ వద్దూ, పీచూ వద్దు .. ఇందుకు మీరొప్పుకుంటేనే నా మనస్సు శాంతిస్తుంది. జులాయిగా తిరుగుతూ పెళ్ళాం సంపాదనమీద బతికే మొగాళ్లంటే వాళ్లు భర్తలయినా సరే పుత్రులయినా సరే- నాకు పరమ అ-స్స-హ్యాం! మీరు అటువంటివారు కాకూడదని నాకోరిక' అంటుంది. భర్త సరే నంటాడు. అప్పుడా ఇద్దరూ చదువుకోవటం, పిల్లలు పుట్టకపోవటం విషయాలగురించి దేవుళ్ల మీదా, సెంటుబుద్ధిమీదా, ఒకరి కొకరిమీదా ఒట్లేసుకుంటారు. ఆ తర్వాత ఇద్దరూ జాజికాయ జాపత్రి వగైరాలతో కర్పూర తాంబూలాలేసు కుంటారు ఇదే ఆఖరుసారి! అంటూ మంచం ఎక్కుతారు ఆ తర్వాత టెక్స్‌ట్‌పుస్తకాలు కొనుక్కొస్తారు. ఎలా వుంది ముగింపు?'' ...

సుందరి కళ్ళు మెరిసాయి. చూసిచూసి భర్త పెదిమల్ని చటుక్కున ముద్దుపెట్టుకుంది. అంది '' బ్యూటిఫుల్! టెర్రిఫిక్! భలే ముగింపు!... ఎంతబాగా ఆలోచించారండి! ఎంత తెలివండీ మీది!'' భర్తమీద పడి ఎడా పెడా దొర్లింది సుందరి. అందిన చోటెల్లా ముద్దు పెట్టుకుంది. చివరికి ఆయాసం వచ్చి ఆగింది... '' నెక్స్‌ట్?'' అన్నాడు యోగారావు '' నెక్స్‌ట్?'' అంది అయోమయంగా.

'' సుందరి... ముగింపిచ్చానుగా... మగాణ్ణేనంటావా?'' ఓరగా చూస్తూ తలొంచుకుని అంది సుందరి '' ఏమో , అదింకాతేల్లేదుగా!''...

'' అయ్'' యోగారావు పౌరుషంగా లేచాడు. అతని పట్టు తప్పించుకుంటూ నవ్వుకొంటూ వొళ్ళోకి ఒక్క అంగలో గెంతింది సుందరి.

( స్వాతి సపరివారపత్రిక 8-3-85 )

* * * * * * * * *